

నేడు దిశ కమిటీ సమావేశం

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి):జిల్లాపరిషత్ ఆడిటోరియంలో మంగళవారం ఉదయం 10.30గంటలకు జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ (దిశ) కమిటీ సమీక్ష నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్, ప్రధానమంత్రి ఆవాస్‌యోజన, పీఎం గ్రామసడక్ యోజన, జాతీయ రహదారులు, ప్రజా పంపిణీ వ్యవస్థ, ఆరోగ్య కుటుంబ సంక్షేమం, మైనారిటీ సంక్షేమానికి సంబంధించిన పథకాలపై సమీక్ష ఉంటుందని తెలిపారు.



కలప.. తరలిపోతోంది

● ఇచ్ఛాపురం పట్టణానికి కూతవేటు దూరంలో తరలించేందుకు సిద్ధంగా ఉన్న కలప ఇది. అక్రమ మార్గంలో చీకటి కొండల నుంచి తెచ్చిన కలప దుంగలను ఇక్కడ నిల్వ చేశారు. ఇక్కడ నుంచి జిల్లాలో ఇతర ప్రాంతాల్లో కర్ర మిల్లులకు వీటిని పంపిస్తారు. నిత్యం ఈ ప్రాంతం నుంచి కలప అక్రమంగా తరలించి కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా అటవీ శాఖ అధికారులు ఇటువైపు చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

● సరిహద్దులో యథేచ్ఛగా అక్రమ రవాణా
● అటవీ ప్రాంతం నుంచి విలువైన సంపద మాయం
● తీర ప్రాంతాల నుంచి నీలగిరి, సరుగుడు చెట్లు కూడా..
● తూతూమంత్రపు తనిఖీలకే అధికారులు పరిమితం

ఇచ్ఛాపురం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి)

సరిహద్దు ప్రాంతంలో కలప అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. గృహోపకరణాలకు కలపను విరివిగా వినియోగిస్తుండడంతో.. మార్కెట్‌లో దీనికి డిమాండ్ పెరుగుతోంది. దీంతో అక్రమార్కుల కన్ను కలపపై పడింది. అటవీ ప్రాంతంలో కలపను నరికి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రధానంగా మహేంద్రగిరులతో పాటు మందస, సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం సరిహద్దులోని చీకటి కొండల్లో ఏపుగా పెరిగిన భారీ వృక్షాలను రాత్రివేళల్లో యంత్రాలతో నరికేస్తున్నారు. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో కలప కోత యంత్రాలు, టింబర్ డిపోలు అధికంగా ఉన్నాయి. వీటిపై అధికారుల నిఘా కొరవడింది. ఈ రెండు నియోజకవర్గాల్లో చాలాచోట్ల చిన్న రైస్‌మిల్లులు మూతపడ్డాయి. వీటిలో అధికంగా కలప కోత యంత్రాలతో పాటు టింబర్ డిపోలుగా మారిపోయాయి. ఈ డిపోలకు వస్తున్న కలప కొంతవరకూ మాత్రమే సక్రమం. మిగతాది అక్రమంగా వస్తున్నదే. అటవీ శాఖ సిబ్బందితో ముందస్తు ఒప్పందం జరిగినా.. ఒకవేళ పోలీసులు తనిఖీ చేస్తే ఇబ్బందులు తప్పవు. అందుకే వేకువజామున 4 గంటల నుంచి ఉదయం 7 గంటల్లోగానే కలపను ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో అక్రమ రవాణా చేస్తున్నారు. రూ.కోట్లలో అక్రమ వ్యాపారాలు సాగిస్తున్నా.. అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

● వెదురు మాయం..

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు ఆనుకుని మహేంద్రగిరులు ఉన్నాయి. అటు ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో విస్తారమైన అడవులు ఉన్నాయి. మహేంద్రగిరులతో పాటు చీకటి కొండల్లో దాదాపు 5 వేల హెక్టార్లలో వెదురు సాగవుతోంది. గతంలో గిరిజనులతో వనసంరక్షణ సమితులు ఏర్పాటుచేసి వెదురు సాగును ప్రోత్సహించేవారు. ఇప్పుడు ఆ వెదురు అందుబాటులోకి రావడంతో వాటిని అక్రమంగా నరికివేసి తరలించుకుపోతున్నారు. వాటిని గిరిజనుల ద్వారా మైదాన ప్రాంతాలకు తెస్తున్నారు. అక్కడ నుంచి లారీలు, కంటైనర్లలో ఇతర ప్రాంతాలకు తరలించి దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో లారీ లోడు వెదురు దాదాపు రూ.1.50లక్షల వరకూ విక్రయిస్తున్నారు. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో సంతల నుంచి నిత్యం పదుల సంఖ్యల లోడుతో వెదురు తరలిపోతోంది. అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేసి వదిలేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● తీరం గుల్ల..

మరోవైపు తీర ప్రాంతం నుంచి నీలగిరి, సరుగుడు పెద్ద ఎత్తున తరలిపోతోంది. జిల్లాలో ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి రణస్థలం మండలం దోనిపేట వరకూ 193 కిలోమీటర్ల మేర తీరం విస్తరించి ఉంది. తీరం వెంబడి పెద్ద ఎత్తున నీలగిరి, సరుగుడు తోటలు ఉన్నాయి. ఇవి తీరానికి రక్షణ కవచంలా ఉంటాయి. విపత్తుల సమయంలో తీరం కోతకు గురికాకుండా కాపాడతాయి. అయితే చాలాచోట్ల ప్రభుత్వ భూములు ఉన్నాయి. వాటిలో అటవీ శాఖ సరుగుడు, నీలగిరి తోటలను పెంచుతోంది. అక్రమార్కులు ఆ తోటల్లో సైతం కలపను యథేచ్ఛగా నరికి.. తరలిస్తున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు స్పందించి కలప అక్రమ రవాణాను అడ్డుకునేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

● దృష్టి పెట్టాం..

పోలీసుశాఖ సహకారంతో కలప అక్రమ రవాణా నియంత్రణపై దృష్టి పెట్టాం. ఎక్కడైనా కలప తరలిస్తున్నట్టు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలి. ఈ విషయంలో సొంత సిబ్బంది పాత్ర ఉందని తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులు పండించే సరుగుడు, నీలగిరి కలపను తరలించవచ్చు. కానీ అడవుల నుంచి తరలిస్తే కఠినమైన చర్యలు తప్పవు. ప్రధానంగా టేకు, నల్లమద్ది, రోజ్‌వుడ్, అకేషియా, గంధం వంటి కలప తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. కలప తరలిస్తే తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి.

-రాము, అటవీ రేంజ్ అధికారి



ఇచ్ఛాపురంలో ఎడ్ల బండ్లు ద్వారా కలప అక్రమ రవాణా (ఫైల్)



మాట్లాడుతున్న రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

'రథసప్తమి' వేడుకల్లో.. తప్పులు పునరావృతం కారాదు

● సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం
● డోనర్ పాసులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి
● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అరసవల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): 'అరసవల్లిలో నిర్వహించనున్న రథసప్తమిని ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. అధికారులంతా సమన్వయంతో పనిచేసి.. అంగరంగ వైభవంగా రథసప్తమి పండుగను నిర్వహించాల'ని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. గతంలో చేసిన తప్పులు పునరావృతం కారాదని హెచ్చరించారు. సూర్యజయంతిని పురస్కరించుకుని రానున్న ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో అరసవల్లిలో రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నారు. వీటి నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లో మంత్రి అచ్చెన్నాయుడు అధికారులతో సమీక్ష నిర్వహించారు.

● మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'వైసీపీ పాలనలో ప్రతీచోటా నాయకుడు రథసప్తమి సందర్భంగా భక్తులను అధిక సంఖ్యలో వీఐపీ దర్శనానికి తీసుకువచ్చి హల్‌చల్ చేసి ఆలయ ప్రతిష్ఠను భ్రష్టు పట్టించారు. దీనికి చరమగీతం పాడాలి. సామాన్యులకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. గతంలో డోనర్, వీఐపీ పాసుల జారీలో అవకతవకలు జరిగాయి. ఆ తప్పులు పునరావృతం కారాదు. ఈసారి జనవరి 5లోగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారికే డోనర్ పాసులు జారీ చేయాలి. ప్రతీ పాస్‌పై క్యూఆర్ కోడ్ తప్పనిసరిగా ఉండాలి. సిఫారసులకు తావు లేకుండా పకడ్బందీగా దర్శనాలకు ఏర్పాట్లు చేయాలి. డోనర్లు రూ.500ల టిక్కెట్లు, ఉచిత దర్శనం భక్తులకు డీసీఎంఎస్ ఆఫీసు వద్ద నుంచి, వీఐపీలకు ముఖద్వారం వద్ద నుంచి ప్రవేశ ఏర్పాట్లు చేయాలి. భక్తులకు తాగునీరు, ఆహారం తదితర ఏర్పాట్లు చేయాలి. పార్కింగ్‌కు ముందుగానే మూడు ప్రదేశాలను గుర్తించాలి. పోలీసు బందోబస్తు పక్కాగా ఉండాలి. మీడియా పాయింట్ ఏర్పాట్లు చేయాలి. వేడుకల సమయంలో శ్రీకాకుళం, అరసవల్లిలో ప్రధాన కూడళ్లను విద్యుత్ వెలుగులతో సుందరంగా అలంకరించాలి. 2, 3 తేదీల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, గ్రామీణ క్రీడల్లో పోటీలను నిర్వహించాలి' అని తెలిపారు. సమావేశంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, శ్రీకాకుళం, నరసన్నపేట ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, కింజరాపు హరవరప్రసాద్, డీఆర్వో అప్పారావు, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎంహెచ్‌వో డా.బి.మీనాక్షి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమ్మో.. నకిలీ నోట్లు!

● ఫేక్ కరెన్సీ ముఠా గుట్టురట్టుతో ఆందోళన
● చెల్లుబాటులోకి వచ్చాయని అనుమానం
● చిన్నపాటి తేడాలు గుర్తిస్తే మేలు

మెళియాపుట్టిలో ఇటీవల ఆరుగురు వ్యక్తుల నుంచి రూ.57.25 లక్షలు నకిలీ నోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అదేరోజు జి.సిగడాం మండలం పెనసాం వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.15లక్షలు నకిలీ నోట్లు పట్టుబడ్డాయి. ఒకేసారి పెద్దమొత్తంలో నకిలీ నోట్లను పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో జిల్లావాసుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

మెళియాపుట్టి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి)

జిల్లా వాసులను నకిలీనోట్ల బెడద వెంటాడుతోంది. జిల్లాలో ఇటీవల నకిలీ నోట్ల ముఠా గుట్టు రట్టవ్వడంతో.. రూ.500 నోట్లు చూస్తే ప్రజలు అదిరిపడుతున్నారు. ఇతరుల నుంచి పెద్ద నోట్లు తీసుకోవాలంటే జంకుతున్నారు. అసలు నోటు ఏదో.. నకిలీ ఏదో బ్యాంకర్లు, వ్యాపారవేత్తలు తప్ప సామాన్యులు గుర్తించే అవకాశం లేదు. దీంతో గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లోని వారే టార్గెట్‌గా నకిలీ నోట్ల చెల్లుబాటుకు తెర తీసినట్టు సమాచారం. గొప్పిలి, మందస, పలాస, పాతపట్నం తదితర ప్రాంతాల్లో నకిలీ నోట్లు ఇప్పటికే మార్కెట్‌లోకి వచ్చాయనే ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా సంతల్లో నకిలీ నోట్ల చలామణీ చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ధాన్యం అమ్మకాల సీజన్‌తో పాటు సంక్రాంతి దగ్గర పడటంతో నకిలీ నోట్ల చలామణీ అధికంగా జరిగే అవకాశం ఉంది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు వైసీపీ హయాంలో ఒడిశా నుంచి గంజాయి, నకిలీ నోట్లు పెద్దమొత్తంలో జిల్లాకు చేరాయని, తద్వారా పలువురు రూ.కోట్లు వెనకేసుకున్నారనే విమర్శలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ మూలాలు బయటపడుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. ఇటీవల మెళియాపుట్టిలో పోలీసులకు పట్టుబడిన నకిలీ నోట్ల ముఠాలో వైసీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యుడు కూడా ఉండడంతో అనుమానాలు బలపడుతున్నాయి.



ఇటీవల పోలీసులు పట్టుకున్న నకిలీ నోట్లు

అవగాహన లేకపోతే అంతే..

అసలు నోటు ఏదో.. నకిలీ ఏదో చాలామందికి అవగాహన లేకపోవడం వల్ల నకిలీ నోట్లు తీసుకొనే పరిస్థితి ఉంది. నకిలీ నోటు అని తెలిసిన తర్వాత బయటకు చెబితే.. పోలీసు కేసు అవుతుందనే భయంతో బయటకు చెప్పనివారూ ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల వల్ల నకిలీ నోట్ల చలామణీ పెరిగే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో అసలు కరెన్సీ.. నకిలీ నోటు మధ్య తేడా, వాటిని ఎలా గుర్తించాలనే దానిపై పోలీసులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

ఇలా గుర్తించవచ్చు..

నకిలీ కరెన్సీ నోట్లను 5 నుంచి 8 రకాలుగా గుర్తించవచ్చునని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారు. రూ.100, రూ.200, రూ.500 నోట్ల రంగు, సైజ్ తప్ప వాటిపై ఉన్న సెక్యూరిటీ ఫీచర్లు దాదాపుగా ఒకేలా ఉంటాయి. నకిలీ నోట్లను రంగు లు బట్టి గుర్తించే అవకాశం ఉంది. అసలు నోటును కంటి ఎదుట పెట్టుకుని చూస్తే మధ్యలో గ్రీన్ కలర్ గీత కనిపిస్తుంది. దాన్ని కొంచెం వంచి చూస్తే బ్లూ కలర్‌గా కనబడుతుంది. ఎదురుగా ఉన్నప్పుడు ఆకుపచ్చని రంగు గీత ఉంటుంది. 45 డిగ్రీల కోణంలోకి వంచి చూస్తే నీలం రంగులో మారుతుంది. ఈ రంగులు నకిలీ నోట్లలో కనిపించవు.

● 2005 సిరీస్‌లో విడుదలైన రూ.100 కంటే ఎక్కువ విలువైన కరెన్సీ నోట్లపై బొమ్మలు కనిపిస్తాయి. నోటు ఎడమ వైపు కింద భాగంలో కనిపించే పట్టీ లోపల ఆ నోటు విలువ సంఖ్య ఉంటుంది. ఆ పట్టీపై వెలుతురు పడినట్లు చూస్తే పట్టీలో ఉన్న లాటెంట్ గుర్తు కనిపిస్తుంది.

● నోటుకు రెండు లైన్‌లు ఉంటాయి. రూ.500 నోటుకు రెండు వైపులా ఈ లైన్స్ ఐదేసి ఉంటాయి. వీటిని బ్లీడ్ లైన్స్ అంటారు. ఈ లైన్స్‌ను చేతితో తాకితే ఉబ్బినట్లు తగులుతాయి. ఐదు లైన్స్ ఉంటే రూ.500, 4 లైన్స్ ఉంటే రూ.100, 4 బ్లీడ్ లైన్స్ మధ్యలో 2 చిన్నావృత్తాలు ఉంటే అది రూ.200 నోటు అని గుర్తించవచ్చు.

● నోటుకు మధ్యలో గాంధీ బొమ్మ, ఆర్బీఐ సీల్, కుడి వైపున అశోకుడి స్తంబం ఉంటాయి. వీటితో పాటు నోటుపై కుడి, ఎడమల చివర్లో ఉండే బ్లీడ్ లైన్స్ కూడా ప్రత్యేక విధానంలో ప్రింట్ చేస్తారు. దీనిని ఇంటాగ్లియో ప్రింటింగ్ అంటారు. ఈ విధానంలో ప్రింట్ అయినప్పుడు తాకితే ఉబ్బుతాయి.

● సెక్యూరిటీ థ్రెడ్ పక్కన ఆర్‌బీఐ గవర్నర్ సంతకం.. దాని కింద ఆర్‌బీఐ ఎంబ్లమ్ ఉంటుంది. దాని పక్కన ఖాళీ భాగాన్ని పరిశీలిస్తే గాంధీ బొమ్మతో వాటర్ మార్క్ ఉంటుంది. దీన్ని ఎలక్ట్రోటైప్ వాటర్ మార్క్ అంటారు. ఇది నోటుపై (మిగతా 6వ పేజీలో..)

పలాసలో హత్యా రాజకీయాలకు తెర తీస్తారా?

● మాజీమంత్రి అప్పలరాజును ప్రశ్నించిన ఎమ్మెల్యే గౌతు శిరీష

8లో

స్వీప్ కార్యక్రమాలకు ప్రాధాన్యం

● ఓటరు జాబితా పరిశీలకులు శేషగిరిబాబు

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు ఓటరు జాబితా పరిశీలకులు, స్టాంపులు రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ ఎంవీ శేషగిరిబాబు(ఐఏఎస్) తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఓటర్ల జాబితా సవరణ-2025పై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన సంబంధిత అధికారులు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమీక్షించారు. సవరణ ప్రక్రియ సందర్భంగా వచ్చిన క్లెయిమ్‌లు, ఆమోదించినవి, తిరస్కరణకు గురైనవాటిపై ఆరా తీశారు. క్లెయిమ్‌ల పరిష్కారంలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పకడ్బందీ ఓటర్ల జాబితా తయారీపై పలు సూచనలు చేశారు. 'అన్ని కళాశాలలు, ఇంజనీరింగ్ కళాశాలల్లో పెద్ద ఎత్తున 'క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం'(స్వీప్) కార్యక్రమాలను నిర్వహించాలి. వర్క్‌షాప్‌లు, సదస్సులు, పోస్టర్‌లు, బ్యానర్‌లు, సోషల్ మీడియా క్యాంపెయిన్‌లు చేపట్టాలి. యువ ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలి' అని శేషగిరిబాబు సూచించారు.

● తొలుత జిల్లాలో చేపట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను కలెక్టర్ వివరించారు. ఇప్పటికే డ్రాఫ్ట్ సిద్ధమయ్యిందని, జనవరి 5న తుది జాబితాను ప్రచురించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. 18-19 సంవత్సరాల మధ్య యువకులు 19,246మంది ఓటర్ల నమోదుకు దరఖాస్తు చేసుకున్నట్లు వెల్లడించారు. మరో 39వేల మంది అర్హులు ఉన్నట్టు గుర్తించామని, ఏడాది పొడవునా వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో అప్పారావు, వివిధ నియోజకవర్గాల ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, ఎన్నికల డీటీలు, టీడీపీ తరఫున పీఎంజే బాబు, ముద్దాడ రామకృష్ణ, బీజేపీ తరఫున సురేష్‌సింగ్ బాబు, చల్లా వెంకటేశ్వరరావు, ఇతర పార్టీల తరఫున రౌతు శంకరరావు, ఎం.గోవిందరావు, ఈశ్వరి, అప్పారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఓటర్ల జాబితా పరిశీలకులు శేషగిరిబాబు

న్యూస్ బాక్స్

ఆరుగురు సచివాలయ కార్యదర్శుల సస్పెండ్

● మరో ఇద్దరికి నోటీసులు జారీ

శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో ఆరుగురు అడ్మిన్ కార్యదర్శులను సస్పెండ్ చేశారు. ఈ మేరకు సోమవారం విశాఖ రీజనల్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారని శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.ప్రసాదరావు తెలిపారు. సచివాలయ కార్యదర్శులు సురేష్ కుమార్ (సానావీధి), కె.సాయితేజ(బాకర్‌సాహెబ్‌పేట), పి.సౌజన్య(మహాలక్ష్మినగర్ కాలనీ), బి.రవితేజ(అరసవిల్లి), జి.దుర్గారావు(దమ్మలవీధి), కె.శ్రీనివాసరావు(కాకివీధి).. కొంతకాలంగా కమిషనర్ అనుమతి లేకుండా సెలవుపై వెళ్లిపోయారు. దీంతో విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ఆ ఆరుగురిని సస్పెండ్ చేశారు. అలాగే హడ్కోకాలనీ కార్యదర్శి గణేశ్వరరావు, బావాజీతోటకు చెందిన రాంబాబుకు ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. 10 నెలల కిందట అప్పటి కమిషనర్ తమీమ్ అన్సారియా హయాంలో హౌసింగ్‌బోర్డు కాలనీ సచివాలయం కార్యదర్శిని సస్పెండ్ చేశారు. తాజాగా ఆరుగురుని సస్పెండ్ చేయడం, మరో ఇద్దరికి నోటీసులు జారీ చేయడంతో సచివాలయాల్లో సిబ్బంది పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటి పన్ను వసూళ్ల బాధ్యతను ప్రభుత్వం సచివాలయ కార్యదర్శులకు అప్పగించింది. కొంతమంది కార్యదర్శులు అధికారుల అనుమతులు లేకుండా సెలవుపై వెళ్లిపోవడంతో ఇంటి పన్నుల వసూళ్లకు గండి పడుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మళ్లీ అలజడి

● వాతావరణంలో మబ్బులు
● ఇంకా పొలాల్లో వీడని వర్షపునీరు
● వరి పంట కాపాడుకునేందుకు

రైతుల పాట్లు

నరసన్నపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు.. వరిపనలు నీటిలో తడిసిపోయాయి. పొలాల్లో వరిచేలు కుప్పల కిందకు చేరిన నీరు ఆరక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం కాస్త తెరిపివ్వడంతో పంటను దక్కించుకోవచ్చని భావించారు. కానీ, సోమవారం ఉదయం నుంచీ మళ్లీ వాతావరణంలో మబ్బులు కమ్ముకోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. జిల్లాలో మరో రెండు రోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ ప్రకటించడంతో ఆందోళన చెందుతున్నారు.

నరసన్నపేట, శ్రీకాకుళం రూరల్, గార, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, మందస, వజ్రపుకొత్తూరు, పలాస, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస, జలుమూరు తదితర మండలాల్లో 8వేల ఎకరాల్లో వరి కోసి పనలు పొలాల్లో ఉన్నాయి. 34వేల ఎకరాలకు చెందిన వరి పైరు కుప్పలు పొలాల్లో భద్రపరిచారు. మరో 23 వేల ఎకరాల్లో వరి కోత కోయాల్సి ఉంది. నరసన్నపేట మండలంలో కోమర్తి, దేవాది, మడపాం, కిల్లాం, మాకివలస, జమ్ము, తామరాపల్లి, ఉర్లాం, సుందరాపురం, పారశెల్లి, సత్యవరం, కంబకాయి తదితర గ్రామాల్లో పొలాల్లో కుప్పలు పెట్టిన ధాన్యం రంగు మారుతోందని రైతులు గగ్గోలు చెందుతున్నారు. దేవాది- మడపాం, బుచ్చిపేట తదితర గ్రామాల్లో వరిపనలు నీటిలోనే ఉన్నాయి. సుమారు 1200ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. పంటను రక్షించేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు.

అపరాలకు తుఫాన్ దెబ్బ

తుఫాన్ ప్రభావం అపరాల పంటపై భారీగా పడింది. నరసన్నపేట, జలుమూరు మండలాల్లో వందలాది ఎకరాల్లో పెసర, మినుము మొక్కలు వర్షపు నీటి ముంపులో ఉన్నాయి. దీంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. సుందరాపురం, పారశెల్లి, తెలగలవలస, చెన్నాపురం, కూర్మనాధపురం, గుండువలస, తాళ్లవలస, ఉర్లాం, బాలసీమ, జమ్ము, కంబకాయి. మాకివలస, కిల్లాం తదితర గ్రామాల్లో మినుము సాగు ఆశాజనకంగా ఉండేది. కాగా తుఫాన్ ప్రభావంతో పొలాల్లో నీరు చేరడంతో నష్టపోతున్నామని ఆయా రైతులు వాపోతున్నారు.



బుచ్చిపేట వద్ద వర్షపు నీటిలోనే వరిపనలు

నాలుగేళ్లు అసంపూర్తిగానే..

● కొలిక్కిరాని అభివృద్ధి పనులు
● పాతపట్నం సీహెచ్‌సీలో రోగులకు అవస్థలు

6లో


గర్ల్స్ హైస్కూల్ వద్ద ఉన్న వర్షిప్ చర్చి..


విద్యుత్ వెలుగుల్లో..

● క్రిస్మస్‌కి సిద్ధమైన చర్చిలు

● నగరంలో సందడి వాతావరణం

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలో చర్చిలు క్రిస్మస్ పండగకు సిద్ధమయ్యాయి. గత 15 రోజులుగా నగరంలో సందడి వాతావరణం నెలకొంది. పలు చర్చిలను విద్యుత్ లైట్లతో అలంకరించారు. మేరీ మాత చర్చి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద వర్షిప్ చర్చి, టౌన్‌హాల్ చర్చి, తెలుగు బాప్టిస్టు చర్చి, ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న సహాయ మాత చర్చి.. ఇలా విద్యుత్ వెలుగులతో కనువిందు చేస్తున్నాయి.


స్టేడియం వద్ద ఉన్న చర్చి..


తెలుగు బాప్టిస్టు చర్చి..

వినియోగదారుడా.. మేలుకో



● వస్తు, సేవల లోపాలకు పరిహారం పొందవచ్చు

● నాణ్యతా ప్రమాణాలను ముందుగా పరిశీలిస్తే మేలు

● నేడు జాతీయ వినియోగదారుల దినోత్సవం

సోంపేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి)

వినియోగదారుడే అమ్మకందారులకు అతిముఖ్యమైన అతిథి. అతడు మనపై ఆధారపడిలేడు. మనమే అతడిపై ఆధారపడి ఉన్నాం. మన వ్యాపారానికి అతడు బయట వ్యక్తికాదు. అందులో భాగమే అతడు. సేవ చేయడం ద్వారా మనం అతడికి ఉపకారమేమీ చేయడం లేదు. అతడే మనకు సేవ చేయగలిగే అవకాశాన్నిచ్చి మనకు ఉపకారం చేస్తున్నాడు.. ఇది మహాత్మాగాంధీ వినియోగదారుడి కోసం అన్నమాట.

వినియోగదారులంటే రక్షణచట్ట ప్రకారం ఎవరైతే సరుకులు, వస్తువులను కొనుగోలు చేస్తారో, ఎవరైతే సొమ్ము చెల్లించి సేవలు పొందుతారో, లేదా సదరు సరుకులు లేదా సేవల కోసం కొంత సొమ్ము చెల్లించి తరువాత వాయిదాల్లో చెల్లించేందుకు ఒప్పుకుంటారో అటువంటి వారంతా వినియోగదారులే. సరుకులు, వస్తువులు, సేవలు వ్యాపారం చేసుకునేందుకో తిరిగి అమ్ముకునేందుకో కొనుగోలు చేసిన వ్యక్తి వినియోగదారుడు కాదు. ప్రతీ ఒక్క వినియోగదారుడూ ఏదో రూపంలో వ్యాపారస్తుల చేతిలో మోసపోతూనే ఉంటాడు. అది వస్తువుల కల్తీ కానీ, తూకంలో తేడాలో కానీ, అధిక ధరల విషయంలో కానీ మోసపోతూనే ఉంటాడు. ఇవే కాకుండా నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుల మందులు రైతులకు శాపంగా మారాయి. బోగస్ ఫైనాన్స్ కంపెనీలు, చిట్‌ఫండ్‌ల వల్ల కూడా పలువురు వినియోగదారులు మోసపోతున్నారు. వీరందరికీ వినియోగదారుల చట్టం ఉంది. అందులో తమకు జరిగిన మోసాలను విన్నవించుకుంటే న్యాయం జరుగుతుంది. వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువుల విషయంతో తేడాలు వస్తే వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించవచ్చు.

వినియోగదారుల రక్షణ చట్టం ఆవిర్భావం

1964సంవత్సరంలో బొంబాయిలో కన్స్యూమర్ గైడెన్స్ సొసైటీ ఏర్పాటు జరిగింది. మన రాష్ట్రంలో విశాఖపట్నం కేంద్రంగా 1973లో ఒక సంఘం ఆవిర్భవించింది. 1978లో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్ ఏర్పడింది. ఇదేకాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటైన 40 సంస్థలు 1986 నాటికి 186కు చేరుకున్నాయి. ఇలా ఆరంభమైన వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఉద్యమం నేడు రాష్ట్రంలో కొన్నివేల సంఘాలు, శాఖలుగా ఏర్పడి విశేష సేవలందిస్తోంది. ఈ చట్టం ప్రకారం కన్స్యూమర్ రిడ్రసల్ ఫోరమ్ (వినియోగదారుల సమస్యల పరిష్కారం-నివారణ) పేరుతో ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేసింది ప్రభుత్వం. ఇవి జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయిలో పనిచేస్తుంటాయి. వీటికి రిటైర్డ్ జడ్జిలు అధ్యక్షులుగా ఉంటారు. ఈ ఫోరమ్ ద్వారానే కేసులు తీర్పులను వెలువరిస్తుంటారు. రూ.20 లక్షల విలువ వరకు జిల్లా ఫోరమ్, రూ.20 లక్షల నుంచి రూ.కోటి వరకు రాష్ట్రస్థాయిలో, రూ.కోటి నుంచి జాతీయ ఫోరమ్‌కు వినియోగదారుడు ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది.

హక్కులు ఇవే..

సమాచారం పొందే హక్కులో భాగంగా కొనుగోలు చేసేవస్తువులు, పొందే సేవల నాణ్యత, పరిమాణం, వాటి ధర, వంటి విషయాలలో సంపూర్ణ సమాచారం పొందడం మీ హక్కు. వస్తువులు కొనుగోలు చేసే ముందు ఆ వస్తువుల పూర్తిసమాచారం అడిగి తెలుసుకోవచ్చు. ● ఎంపిక హక్కులో భాగంగా అనేక రకాల వస్తువులు, సేవలను సరసమైన ధరలలో పొందడం మీహక్కు. వస్తువుల ఎంపిక హక్కు మీదే కాబట్టి మీరే సరైన నిర్ణయం తీసుకోవాలి. వస్తుసేవల నాణ్యత పరిరక్షించుకునే హక్కు మీదే. లోపం ఉన్నవస్తువులను తిరస్కరించే హక్కు ఉంటుంది. ● అభిప్రాయం వినిపించే హక్కులో భాగంగా వినియోగదారుల సంక్షేమార్థం మీరు వేదికపై మీ అభిప్రాయాన్ని వినిపించవచ్చు. ప్రభుత్వం, రాజకీయేతర, వాణిజ్యేతర వినియోగదారులు సంఘాలను ఏర్పాటు చేసుకోవచ్చు. ఇది మీ ప్రాథమిక హక్కు. ● న్యాయం పొందే హక్కులో భాగాంగా వాణిజ్యపర విధానాలు, మోసపూరిత పద్ధతులనుంచి న్యాయబద్ధమైన రక్షణ పొందే హక్కు ప్రతీ వినియోగదారునికీ ఉంది. ● భద్రత హక్కులో భాగంగా కొనే వస్తువులు, పొందే సేవలు తమ అవసరాలను తీర్చడమే కాకుండా అవి కంపెనీలు ఇచ్చే భద్రత ప్రకారం దీర్ఘకాలం మన్నేలా ఉండాలి. ఈ భద్రత పొందడానికి కొనేవస్తువుల నాణ్యతను ముందుగానే నిర్ధారించుకోవాలి. వీలైనంతవరకు నాణ్యతమైనవే కొనుగోలు చేయాలి.



జాగ్రత్తలు తప్పనిసరి

కొనుగోలుచేసే వస్తువులు విషయంలో ముందుగానే పూర్తిసమాచారం సేకరించాలి. మోసపూరిత ప్రకటనలపై జాగ్రత్త వహించాలి. వస్తువుల నాణ్యతపై ఏమాత్రం రాజీపడవద్దు. కొనుగోలుసమయంలో సరైన రశీదును అడిగి తీసుకోవడంతో పాటు వారంటీ కార్డుపై యజమాని ముద్ర, సంతకంతో తీసుకోవడం మరువరాదు. నాసిరకం వస్తువులు, మోసపూరిత ప్రకటనలపై వినియోగదారుల ఫోరమ్‌లను ఆశ్రయించడానికి మరువవద్దు.

ఫిర్యాదులో ఉండాల్సిన వివరాలు

ఎవరైనా వ్యాపారి అవలంభించిన అక్రమ వ్యాపార పద్ధతుల ఫలితంగా ఎంత నష్టం వాటిల్లిందనే విషయం చెప్పాలి. ఫిర్యాదులో పేర్కొన్న వినియమ వస్తువులకు ఒకటి కానీ అంతకన్నా ఎక్కువ కానీ లోపాలు ఉన్న వివరాలు పొందుపరచాలి. ఫిర్యాదులో పేర్కొన్న సేవల్లో ఏ అంశంలో లోపాలు ఉందనే సమాచారం వివరించాలి. ఫిర్యాదులో పేర్కొన్న వినిమయ వస్తువులకు వ్యాపారి నిర్ధారిత ధర కన్నా ఎక్కువ ధర వసూలు చేసిన వివరాలు పొందుపరచాలి. వీటితో పాటు ఫిర్యాదుదారుని పేరు, చిరునామా. ఎవరిపై ఫిర్యాదు చేస్తున్నారో వారి చిరునామా స్పష్టంగా చెప్పాలి.

అవగాహన అవసరం

సమాజంలో ఎక్కువ శాతం వినియోగదారులకు తమకు ఉన్న హక్కులపై అవగాహన చాలా తక్కువగా ఉంది. దీంతో వ్యాపారుల మోసాలకు పాల్పడుతున్నారు. వినియోగదారుల మోసాలపై కొంత మందైనా స్పందించి వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించి మోసపూరిత వ్యాపారులకు శిక్షపడేలా చేస్తే మిగతావారు భయపడతారు.

-నగిరి మోహనరావు, ఉపాధ్యాయుడు, సోంపేట


జె.శాసనాంలో ఆర్టీసీ బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ అశోక్

ఆర్టీసీ సర్వీసు ప్రారంభం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కంచిలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జె.శాసనాం నుంచి కొత్తగా ఆర్టీసీ బస్సు సర్వీసును స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సోమవారం ప్రారంభించారు. ఈ ప్రాంతంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'బస్సూ.. బస్సూ.. ఎప్పుడొస్తావ్?' అనే శీర్షికతో ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు. సోమవారం జె.శాసనాం నుంచి సోంపేట వరకు ఆర్టీసీ సర్వీసును ప్రభుత్వ విప్ అశోక్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించారు. ఈ సందర్భంగా విప్ అశోక్ విలేకరులతో మాట్లాడుతూ.. 'మారుమూల గ్రామాలకు సైతం ఆర్టీసీ సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గతంలో రహదారులు బాగోలేక ఆర్టీసీ సర్వీసులను నిలిపివేసిన గ్రామాలకు సైతం సర్వీసులు పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా కళాశాల వేళలకు అనుగుణంగా సర్వీసులు నడిపేందుకు అధికారులతో చర్చిస్తున్నాం. ఈ బస్సు ఉదయం 8 గంటలకు జె.శాసనాంలో బయలుదేరుతుంది. మళ్లీ సాయంత్రం 6 గంటలకు సోంపేట నుంచి జె.శాసనాం వెళ్తుంది. ఆర్టీసీ సేవలను విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బస్సులో ప్రయాణికులతో కొంత దూరం ఆయన ప్రయాణించి వారితో మాట్లాడారు. బస్సు సౌకర్యం కల్పించినందుకు స్థానికులు విప్ అశోక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలాస డీఎం రోణంకి సీతారామనాయుడు, అసిస్టెంట్ మేనేజర్ పి.సంతోష్‌కుమార్, వివిధ ఆర్టీసీ యూనియన్ నాయకులు దిలీప్, వాసు, విజయ్, హెచ్‌సీ డా.రామ్మోహన్, కూటమి నాయకులు మాదిన రామారావు, బంగారు కురయ్య, జగదీష్ పట్నాయక్, పైల పురుషోత్తం రెడ్డి, పిలక చినబాబు, ధర్మా యాదవ్ మద్దిల భాస్కరరావు, సంతోష్, బొడ్డు అప్పారావు పాల్గొన్నారు.

అమ్మో.. నకిలీ నోట్లు!

(ఐదో పేజీ తరువాయి)

చెక్కినట్లుగా కనిపిస్తుంది. గాంధీ బొమ్మ వాటర్ మార్క్ పక్కనే దాని డినామినేషన్ తెలిపే సంఖ్య ఉంటుంది.

● నోట్లు సెక్యూరిటీ ఫీచర్ ద్వారా కూడా గుర్తించవచ్చు. 2015 తర్వాత నోటుపై కుడివైపు కింద భాగంలో ముద్రించి ఉండే సంఖ్యలో ఒక సెక్యూరిటీ ఫీచర్ ఏర్పాటు చేశారు. ఆ సంఖ్య ఎడమ నుంచి కుడికి చూస్తున్నప్పుడు సంఖ్య సైజ్ పెరుగుతుంది. అయితే ముందు ఉండే మూడు ఇంగ్లీష్ అక్షరాలు మాత్రం ఒకే సైజ్‌లో ఉంటాయి. ఆ తర్వాత వచ్చే ఆరు అంకెల సంఖ్యలోని ఒక్కో సంఖ్య సైజ్ కుడి వైపునకు పెరుగుతూ ఉంటుంది. ఆ సంఖ్య ఏ రెండు నోట్లకు కూడా ఒకేలా ఉండదు.

పరిశీలించి తీసుకోవాలి..

నోట్లు తీసుకున్నప్పుడు అన్ని గమనించి తీసుకుంటే మంచిది. నకిలీ, ఒరిజనల్ నోట్ల గుర్తింపుపై అందరికీ అవగాహన తప్పనిసరి. అధికంగా నోట్ల కట్టలు తీసుకునేవారు.. వాటిని నిశితంగా పరిశీలిస్తే మంచిది.

-పొట్నూరు గుణకరరావు, క్యాషియర్, ఎస్‌బీఐ, టెక్కలి

నోటు దొరికితే సమాచారమివ్వండి..



నకిలీ నోట్లు పొరపాటున వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అనుమానం వచ్చిన సరే రహస్యంగా సమాచారం అందిస్తే.. తెలిపిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతాం.

-పిన్నింటి రమేష్‌బాబు, ఎస్ఐ, మెళియాపుట్టి

అర్జీలను సత్వరమే పరిష్కరించండి: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో ఆయన జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి 77 అర్జీలు స్వీకరించారు. వచ్చే 22 నుంచి ఫిబ్రవరి 22 వరకు కుష్టు వ్యాధిపై సర్వే నిర్వహించనున్నామని, ఆరోగ్య సిబ్బందికి అందరూ సహకరించాలని ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మీనాక్షి కోరారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఇన్‌ఛార్జి డీఆర్వో అప్పారావు, డిప్యూటీ కలెక్టర్లు లక్ష్మణమూర్తి, పద్మావతి, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజు పాల్గొన్నారు.


వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నాలుగేళ్లుగా అసంపూర్తిగానే..

● కొలిక్కిరాని అభివృద్ధి పనులు

● కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ

● రోగులకు తప్పని అవస్థలు

● ఇదీ.. పాతపట్నం సీహెచ్‌సీలో దుస్థితి

పాతపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సామాజిక ఆసుపత్రిలో ప్రారంభించిన అభివృద్ధి పనులు నేటికీ ఓ కొలిక్కి రాలేదు. పనులన్నీ అసంపూర్తిగా ఉన్నాయి. కొన్ని పనులు పూర్తయినా అవి వినియోగించే పరిస్థితిలేదు. పర్యవసానంగా సామాజిక ఆసుపత్రిలో వైద్యులు, రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు. పాతపట్నంలోని 50 పడకల సామాజిక ఆసుపత్రిలో నాడు-నేడులో భాగంగా గత ప్రభుత్వం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఇందుకుగానూ రూ.4.20 కోట్ల నాబార్డు నిధులను కేటాయించింది. ఏపీఎంఎస్‌ఐడీ పర్యవేక్షణలో ప్రారంభమైన పనులు నాలుగేళ్లు కావస్తున్నా పూర్తి కాలేదు. పనులు జరుగుతున్న సమయంలో అప్పటి ఐటీడీఏ పీవో సాయివర్మ వారానికి ఒకసారి ఆసుపత్రిని సందర్శించేవారు. దాంతో పనులు పూర్తయితే మెరుగైన వైద్యసేవలు పొందవచ్చునని ప్రజలు ఆశించారు. కొన్నాళ్లకు పీవో బదిలీ కావడంతో పనులను పర్యవేక్షించేవారే కరువయ్యారు. అభివృద్ధి పనుల్లో భాగంగా ఆసుపత్రి పైభాగంలో నిర్మాణాలతో పాటు కింది భవనంలో టైల్స్ తొలగింపు, మరుగుదొడ్ల నిర్మాణాలు, విద్యుదీకరణ పనులు మాత్రమే సంబంధిత కాంట్రాక్టర్ చేపట్టారు. మిగిలిన పనులు ఎక్కడకక్కడే వదిలేశారు. దీంతో రోగులకు సేవలందించేందుకు వీలుపడని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయాన్ని వైద్యులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రెండు వార్డులు అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ పనులు పూర్తిచేయకుండా సంబంధిత కాంట్రాక్టర్ వైద్యులకు అప్పగించేశాడు. పలుచోట్ల టైల్స్, మెటీరియల్ పోగులుగా ఉన్నాయి. విద్యుత్ వైర్లు వేలాడుతునే ఉన్నాయి. దీంతో రోగులు భయాందోళనకు గురవుతున్నారు.


ప్రారంభానికి నోచుకోని ప్రసూతి విశ్రాంతి గృహం

వినియోగానికి దూరంగా..

ఐసీయూ విభాగం లోపల పనులు పూర్తి చేసినప్పటికీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. దాంతో ఐసీయూ వినియోగానికి దూరంగా ఉంది. కాగా, ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మించిన పేషెంట్ అటెండెంట్ రూమ్స్ పూర్తయినా అవి నిరుపయోగంగా ఉన్నాయి. కిచెన్ రూం అధికారులకు అప్పగించక పోవడంతో రోగుల వచ్చే అటెండెంట్లు అసౌకర్యానికి గుర వుతున్నారు. వైద్యులు, రోగులకు రక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఇక్కడి ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. అయితే దాన్ని అధికా రులకు అప్పగించలేదు. దాంతో పరికరాలు పాడవుతున్నాయి. అసంపూర్తి పనుల కారణంగా ఆక్సిజన్ ప్లాంట్ సైతం వినియోగానికి దూరంగా ఉంది.


క్వార్టర్స్ తొలగించి.. ఆ స్థానంలో అసంపూర్తిగా నిలిచిన పార్కు ఏర్పాట్లు..

ఆహ్లాదం పేరిట ధ్వంసం..

ఆసుపత్రి ఎదుట ఆహ్లాద వాతావరణాన్ని నింపాలనే లక్ష్యంతో అక్కడి సిబ్బంది క్వార్టర్స్‌ను పడగొట్టారు. ఆసుపత్రికి చేరువలో వైద్యులు, సిబ్బంది చేరువలో ఉంటే అత్యవసర వైద్యసేవలు రోగులకు అందుతాయనే ఉద్దేశంతో గతంలో క్వార్టర్స్ నిర్మించారు. అవి వినియోగంలోనే ఉండేవి. అయితే క్వార్టర్స్ శిథిలావస్థకు చేరుకున్నాయనే ఉద్దేశంతో వాటిని కూల్చేశారు. అయితే అక్కడ పార్కు నిర్మాణానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో అభివృద్ధి పనులపై పాలకులు, ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సి అవసరం ఉంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాక ఏడాది కిందట ఇదే ఆసుపత్రిలో అభివృద్ధి పనులకు అప్పటి టీడీపీ ప్రభుత్వం సుమారు రూ.98 లక్షలు వెచ్చించింది. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం మళ్లీ అభివృద్ధి పనులకు పెద్దఎత్తున నిధులు మంజూరు చేయడం ఇక్కడ ప్రత్యేకత.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



ఆసుపత్రిలో నాడు-నేడు పనులు అసంపూర్తిగా నిలవడంతో ఇబ్బందులు పడుతున్నాం. రోగులకు సేవలు అందించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-డాక్టర్ ఎస్.కృష్ణారావు, వైద్యాధికారి, సీహెచ్‌సీ పాతపట్నం

'మీకోసం'లో 48 వినతులు

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసంలో 48 వినతులు ఎస్పీ మహేశ్వరరెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. చట్ట ప్రకారం పూర్తిస్థాయిలో పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు. క్రిస్మస్ వేడుకలు చేసుకోనీయకుండా కొంతమంది అడ్డుకుంటున్నారని, క్రిస్మస్ వేడుకలు సజావుగా జరుపుకునేలా అవకాశం కల్పించాలని ఎస్పీని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు కోరారు. తనపై దాడి చేసిన వారిని శిక్షించాలని, తనను చంపేందుకు కొందరు వెంబడిస్తున్నారని బూర్జ మండలం గుత్తావిల్లి గ్రామానికి చెందిన సనపల సురేష్ ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.


అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

ఉపాధి పనులు త్వరగా పూర్తి చేయాలి

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్‌తో కలిసి సంబంధిత అధికారులతో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాలో 40 శాతం పనులు పూర్తయ్యాయని, వచ్చే ఏడాది మార్చిలోగా శతశాతం పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తొలుత కలెక్టర్ నియోజకవర్గాలు, మండలాల వారీగా చేపట్టిన పనులను వివరించారు. జిల్లాలో ఇసుక సమస్య లేదని, పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులు వెంటనే అప్‌లోడ్ చేస్తే చెల్లింపులు ఆలస్యం లేకుండా జరుగుతాయన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పరిపాలన సాగుతుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. తేమశాతం ఎక్కువ ఉన్నా, ధాన్యం రంగుమారినా కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్యపడాల్సిన పనే లేదని స్పష్టం చేశారు. పలాసలో టీడీపీ నాయకుడి హత్యకు సుపారీ ఇవ్వడం వంటి ఘటన చోటుచేసుకోవడం దారుణమన్నారు. ఇటువంటి సంస్కృతి ఇంతవరకు మన జిల్లాలో లేదని, దోషులు ఎంతటి వారైనా వదిలేది లేదని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శ్రీకాకుళం, నరసన్నపేట ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డ్వామా పీడీ సుధాకర్, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ సుధాకర్, జీఎస్టీ కమిషనర్ రాణీమోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ భాషా, పంచాయతీరాజ్ ఈఈలు, మండల స్థాయి ఇంజనీర్లు, తదితరులు హాజరయ్యారు.

ప్రేమతో మెలగాలి

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఏసు ప్రభువు ఆశీస్సులు రాష్ట్రం, జిల్లా ప్రజలపై ఉండాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు. బీఆర్ అంబేడ్కర్ కళావేదికలో ఏర్పాటు చేసిన హైటీ క్రిస్మస్-2024 కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ప్రభుత్వం తరపున మంత్రి ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్లకు గౌరవ వేతనం కింద ప్రభుత్వం నెలకు రూ.5వేలు ఇస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రేమతో మెలగాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ పుండ్కర్ మాట్లాడుతూ.. చర్చిల వద్ద భద్రత, పారిశుధ్యం, తాగునీరు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, పాస్టర్ కృపానందం, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జాన్ తదితరులు పాల్గొన్నారు.


క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు తదితరులు

అధికార లాంఛనాలతో సీఆర్‌పీఎఫ్ జవాన్ అంత్యక్రియలు


లక్ష్మణరావు(ఫైల్)

పొందూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుకు గురై మృతి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ అంత్యక్రియలు అధికార లాంఛనాలతో సోమవారం నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. గోకర్ణపల్లి గ్రామానికి చెందిన దువ్వారపు లక్ష్మణరావు(44) సీఆర్‌పీఎఫ్ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధుల్లో ఉండగా లక్ష్మణరావు గుండెపోటుకు గురవ్వడంతో తోటి సిబ్బంది ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. లక్ష్మణరావు మృతదేహాన్ని సీఆర్‌పీఎఫ్ అధికారులు సోమవారం స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ అధికారులు, స్థానిక పోలీసు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొని నివాళులర్పించారు. లక్ష్మణరావుకు భార్య,ఇద్దరు కుమారులు ఉన్నారు.

చిన్నారులకు సాయం

ఆమదాలవలస, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తిమ్మాపురం గ్రామానికి చెందిన ఉపాధ్యాయురాలు సంపతిరావు త్రివేణి ఇటీవల కోటబొమ్మాళి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు గురుగుబెల్లి దామోదరరావు, సూర స్వర్ణకుమారి సోమవారం ఆ గ్రామానికి వెళ్లి త్రివేణి ఇద్దరు కుమార్తెలకు తమవంతు సాయాన్ని అందించారు. త్రివేణి నాన్ లోకల్ టీచర్‌గా చిత్తూరు జిల్లాలో పనిచేస్తూ.. అంతర జిల్లాల బదిలీల్లో భాగంగా గతేడాది బదిలీపై ఇక్కడకి వచ్చారు. ఇంతలోనే ఇంత ఘోరం జరిగిపోయిందని వారు గుర్తు చేసుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు. త్రివేణి భర్త ఓ ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తున్నాడు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

సోంపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): చీరాలలో ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో లాక్రోస్ పోటీల్లో మామిడిపల్లి గ్రామానికి చెందిన లండ కిరణ్‌కుమారి సత్తాచాటి జాతీయస్థాయి పోటీకి ఎంపికైంది. ఈమె ఎంపికపై తండ్రి సూర్యనారాయణ, గురువు సురేంద్ర రెడ్డి, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి

ఎచ్చెర్ల, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఫరీద్‌పేట గ్రామంలో శ్మశానవాటికకు సీసీ రోడ్డు మంజూరు చేయాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావును బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం నడుకుదిటివానిపాలెంలోని క్యాంప్ ఆఫీసులో కలిసి వినతి పత్రం అందజేశారు. సరైన రోడ్డు లేకపోవడంతో అంతిమ యాత్రకు అష్టకష్టాలు పడాల్సివస్తోందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. నాయకులు పైడి వేణుగోపాలం, సంపతిరావు నాగేశ్వరరావు, కంచరాపు ఉమామహేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వర్లు ఉన్నారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్

ఇచ్ఛాపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రోబిన్‌కుమార్ పాడి అన్నారు. సోమవారం డిగ్రీ విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగహన కల్పించారు. ఏపీఎస్‌సీహెచ్‌ఈ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్), సంబంద్ హెల్త్ ఫౌండేషన్ హర్యానా ఆదేశాల మేరకు డ్రగ్స్‌పై విద్యార్థులు తయారు చేసిన పోస్టర్‌ను ఆవిష్కరించి డ్రగ్స్ వాడడం వల్ల కలిగే అనార్థాలు వివరించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి సంతోష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, త్రిపాఠి, రాధ, దేవరాజ్ పాల్గొన్నారు.

ఘనంగా రామానుజన్ జయంతి


రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

లావేరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బెజ్జిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద సోమవారం గణిత శాస్త్ర పితామహుడు రామానుజన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి హెచ్‌ఎం ఎస్.రమణ, ఉపాధ్యాయుడు చిరంజీవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామానుజన్ చేసిన అనేక ఫార్ములాలు విద్యార్థులతో చేయించి అవగాహన కల్పించారు.

నీటిలోనే వరి పంట


పరిశీలిస్తున్న ఏవో

కవిటి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుసి వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షం తెరిపిచ్చినా వరి పంట ఇంకా నీటిలోనే ఉంది. కవిటి, పుటియాదల, మాణిక్యపురం, బొరివంక బీలప్రాంతాల్లో పంట నీటిలోనే ఉంది. కవిటి, బెజ్జిపుట్టుగ ప్రాంతాల్లో సోమవారం వ్యవసాయాధికారి బి.దుర్గాప్రసాద్, సిబ్బంది ముంపు పొలాలను పరిశీలించారు. వ్యవసాయ విస్తరణాధికారి బి.కళ్యాణ్ ఉన్నారు.


తడిసిపోయిన వరి పనలు చూపిస్తున్న రైతు

● గార, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు చాలా గ్రామాల్లో వరి పంట ఇంకా వర్షం నీటిలోనే మునిగి పోయి కనిపిస్తున్నాయి. వత్సవలస, వమరవెల్లి, శ్రీకూర్మం తదితర గ్రామాల్లో కోసిన వరి పంట తడిసి పోయింది.

● సరుబుజ్జిలి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని కూన జమ్మన్నపేట, బుడ్డివలస, వ్యాసులపేట, తురకపేట, పెద్దపాలెం, చిన్నపాలెం గ్రామాల్లో వర్షం నీరు వరికుప్పలు చుట్టూ చేరడం వల్ల వరిచేనుకు నష్టం వాటిల్లే ప్రమాదముందని రైతులు వాపోతున్నారు. మళ్లీ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వర్షం నీరు పొలాల్లో నిల్వ ఉండిపోవడంతో అపరాల పంట దెబ్బతిన్నాదని, మళ్లీ వాయుగుండ ఏర్పడితే కోలుకునే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.


వరి కుప్పలు చుట్టూ చేరిన వర్షపునీరు

పనితీరు మారకపోతే చర్యలు తప్పవు

● ఎమ్మెల్యే రవికుమార్


ప్రజా దర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే విధానం వల్ల ఎంతో మంది రైతులు ఇబ్బందిపడుతున్నారని, వాటిని సరిచేయకుండా నిర్లక్ష్యంగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంపై ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్య క్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ తహసీల్దార్ కార్యాలయాలకు వస్తున్న సమయంలో బూర్జ మండలం ద్వారకవలస గ్రామానికి చెందిన ధర్మవరపు ఆదిలక్ష్మి అనే వికలాంగురాలు ఆయన్ని కలిసి తన సమస్యను వివరించింది. తన భూమిని రీసర్వే నిర్వహించిన అధికారులు ఇతరుల పేరున నమోదు చేశారని, పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. దీనిపై స్పందించి ఆయన వెంటనే సంబంధిత వీఆర్‌వోతో ఫోన్‌లో మాట్లాడి తక్షణమే ఈ సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో నియోజకవర్గానికి చెందిన పలువురు రెవెన్యూ సమస్యలపై ఎమ్మెల్యేకు అర్జీలు ఇచ్చారు. కార్య క్రమంలో తహసీల్దార్ ఎస్.రాంబాబు, ఆర్ఐ పి.గోవిందరావు, మండల సర్వేయర్ బి.గోపి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మందిర ప్రారంభోత్సవ ఏర్పాట్ల పై చర్చ


పీఠాధిపతి ప్రభుమహారాజ్‌కు సన్మానం చేస్తున్న దృశ్యం

రణస్థలం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బంటుపల్లి పంచాయతీ పరిధి జాతీయ రహదారికి ఆనుకుని కృష్ణ చైతన్య మఠం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న రాధా గోవింద మందిర ప్రారంభోత్సవం ఏర్పాట్లపై ఆశ్రమ పీఠాధిపతి ప్రభుమహారాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం చర్చించారు. ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావుతోపాటు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు కావడంపై ఇరువురు నేతలు చర్చించారు. అధిక సంఖ్య భక్తులు రానున్నారని, అవసరమైన ఏర్పాట్లుపై మాట్లాడారు. కూటమి నేతలు ముప్పిడి సురేష్, పిసిని జగన్నాథంనాయుడు, కలిశెట్టి సూర్యనారాయణ, లంక ప్రభ, పిన్నింటి ముధుబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే సదస్సులు



మాట్లాడుతున్న మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రామకృష్ణ

బూర్జ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు సంబంధించిన రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకే ఈ సదస్సులు నిర్వహిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు అన్నారు. పెద్దపేట సచివాలయంలో తహసీల్దార్ వైవీ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఓనిగెడ్డ నీటి స ఘం చైర్మన్ కడగల కృష్ణ, రిజర్వాయర్ నీటి సంఘం చైర్మన్ దూబ బాలకృష్ణ, వైస్ చైర్మన్ దాసిరెడ్డి మౌళి, ఎన్ని విశ్వనాథం పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి


అల్లెనలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ

బూర్జ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎస్ఐ ప్రవల్లిక పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనరాలపై స్థానిక మాఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల సిబ్బందితో పాటు అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం అల్లెన గ్రామాన్ని సందర్శించి, వివిధ అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

బధిరుల క్రికెట్ జట్టుకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న జేసీ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బధిరుల జిల్లా క్రికెట్ జట్టును జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అభినందించారు. ఈ మేరకు సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జేసీని జట్టు సభ్యులంతా మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల విశాఖలో జోన్-1 పరిధిలో గల ఐదు జిల్లాల బధిరుల క్రికెట్ జట్లు టీ-20 పోటీల్లో పాల్గొనగా.. శ్రీకాకుళం జట్టు విజేతగా నిలిచింది. కార్యక్రమంలో బధిరుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.ఈశ్వరరావు, కార్యదర్శి ఎ.భాస్కరరావు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీవో శ్రీధర్

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులకు మూడు బంగారు పతకాలు, ఐదు రజిత పతకాలు సాధించడంతో ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. మూడు రోజుల కిందట పిఠాపురంలో జరిగిన సీనియర్ పురుషుల బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల బృందం పాల్గొంది. ఇందులో సీహెచ్ జ్ఞానేశ్వరరావు, పి.అప్పలరాజు, ఆర్.హేమంత్ కుమార్ బంగారు పతకాలు సాధించగా, పి.విశ్వేశ్వరరావు, ఎం.లోకేష్, ఎస్.ఏసు, కె.శ్రీకాంత్, డి.మనోజ్‌కుమార్ రజిత పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు, శిక్షణ ఇచ్చిన ఉమామహేశ్వరరావుకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ అభినందించారు.

సత్తాచాటిన బాడీబిల్డర్లు



పతకాలు సాధించిన బాడీబిల్డర్లు

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జూనియర్ జాతీయ శరీర సౌష్టవ పోటీల్లో ఆంధ్ర ప్రదేశ్ తరుపున పాల్గొన్న బాడీ బిల్డర్లు సత్తాచాటారు. జూనియర్ విభాగం 55 కేజీల విభాగంలో ఎస్‌కె.జాఫర్, 60 కేజీల విభాగంలో పి.సతీష్‌లకు ప్రథమస్థానం, 70 కేజీల విభాగంలో ఎల్.దుర్గా ప్రసాద్, 55 కేజీల విభాగంలో ఎ.రాజేష్‌కు ద్వితీయస్థానం, 75 కేజీల విభాగంలో ఆర్.సాయి సిద్ధుకు తృతీయస్థానం సాధించారు. అలాగే డి.గోపిచంద్, ఎస్.జయచందు, టి.నూకరాజు నాలుగో స్థానంలో నిలిచారు. విజేతలకు ఆంధ్రప్రదేశ్ బాడీబిల్డర్స్ సంఘం చైర్మన్ కేఎంవీ నాగేశ్వరరావు, కార్యదర్శి వి.విజయకుమార్ అభినందించారు.

కేంద్ర ప్రభుత్వ తీరు సరికాదు


ర్యాలీగా వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

అరసవల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగంపై దాడికి పాల్పడుతోందని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు విమర్శించారు. ఈ మేరకు ఆయన పార్టీ శ్రేణులతో ర్యాలీగా వెళ్లి గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లౌకికత్వం, స్వేచ్ఛ, సమానత్వం, స్వాతంత్ర్యం వీటన్నింటినీ కాలరాస్తూ మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలపై దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు రెల్ల సురేష్, ఈశ్వరి, టి.మధుసూదనరావు, పూడి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలపై నిరంతర నిఘా

రణస్థలం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు క్రైమ్ ప్రోన్ ఏరియాలపై నిరంతరం నిఘా ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. ఈ మేరకు సోమవారం జేఆర్ పురం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్మానుష్యమైన ప్రదేశాల్లో డ్రోన్ల ద్వారా నిఘా ఏర్పాటు చేశామన్నారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్టు వేసేందుకు ఈ నిఘా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గంజాయి వినియోగం, పేకాట శిబిరాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి న్యూసెన్స్ చేసేవారిని గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

ఆమదాలవలస, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.రామారావు అన్నారు. సోమవారం కళాశాలలో వినియోగదారుల క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. వినియోగదారులకు అన్యాయం జరిగితే వినియోగదారుల ఫోరం ద్వారా న్యాయం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో టి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ పీవోగా శ్రీలత

సోంపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బారువ డిగ్రీ కళాశాల జాతీయ సేవ పథకం యూనిట్-1 ప్రోగ్రామ్ అధికారిగా పి.శ్రీలతను నియమించినట్టు ప్రిన్సిపాల్ డి.రామారావు తెలిపారు. ఈమె నియామకంపై వైస్‌ప్రిన్సిపాల్ పి.రామకృష్ణ, అధ్యాపక సిబ్బంది అభినందనలు తెలిపారు.

పోరుబాటకు సిద్ధం కావాలి

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆరు నెలల పాలనలో విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై పెనుభారం మోపిందని వైసీసీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఈ మేరకు పెద్దపాడులోని పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కృష్ణదాస్ మాట్లాడుతూ... విద్యుత్ చార్జీల బాదుడుపై వైసీపీ పోరుబాట చేపట్టిందన్నారు. ఈ నెల 27న సూర్యమహల్ జంక్షన్ నుంచి పోరుబాట ప్రారంభమవుతుందని, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం పోరుబాట పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసీపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోండి

కంచిలి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు తడచిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలంలో వరి పంట పొలాలను ఎంపీపీ, జడ్పీటీసీలతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అకాల వర్షాలకు తడిచిన ధాన్యం, రంగు మారిన ధాన్యాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, జడ్పీటీసీ ఇప్పిలి లోలాక్షి తదితరులు పాల్గొన్నారు.

● ఆమదాలవలస, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా రైతులకు తీవ్ర నష్టం జరిగిందని, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను నియోజకవర్గ వైసీపీ సమన్వయ కర్త చింతాడ రవికుమార్ కోరారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో వినతిపత్రం సోమవారం అందించారు.

ఎంఈవో-2గా విశ్వనాథ్

ఇచ్ఛాపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎచ్‌పీసీ ఎంఈవో-2గా ఎస్.విశ్వనాథం బాధ్యతలు చేపట్టారు. ఈమేరకు సోమవారం ఎంఆర్‌సీ సిబ్బంది సాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. ధర్మపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న విశ్వనాథం ఎంఈవో-2గా బాధ్యతలు చేపట్టడంతో ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది ఉప్పాడ కామేష్, ఎ.రవికుమార్ పాల్గొన్నారు.

నరక'దారులు'

- వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు
- గోతులు, రాళ్లతో ప్రయాణికుల బెంబేలు



లావేరు: బురదమయంగా గుమడాం రహదారి



జి.సిగడాం: మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి ఇలా..



ఆమదాలవలస: వాకలవలస వద్ద ప్రధాన రహదారి దుస్థితి

జి.సిగడాం/లావేరు/సరుబుజ్జిలి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా జిల్లాలో గత మూడురోజులుగా కురుస్తున్న చిరు జల్లులకు పలు రోడ్లు దెబ్బతిన్నాయి. ఎక్కడికక్కడే గోతులు ఏర్పడి, రాళ్లు తేలి భయానకంగా మారాయి. దీంతో ప్రయాణికులు బెంబేలెత్తి పోతున్నారు. సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్ నుంచి సరుబుజ్జిలి జంక్షన్ వరకు ఉన్న కిలో మీటరు దూరం ప్రధాన రహదారి భారీ గుంతల ఏర్పడి చెరువును తలపిస్తోంది. అలాగే, ఆమదాలవలస-శ్రీకాకుళం రహదారిలో వాకలవలస నుంచి రాగోలు వరకు అడుగుకొక గొయ్యి దర్శనమిస్తోంది. పొగిరి కూడలి నుంచి జి.సిగడాం వెళ్లే రహదారిపై గోతుల్లో వర్షపు నీరు చేరింది. లావేరు మండలంలోని గుమడాం బీటీ రోడ్డు నుంచి గ్రామంలోకి వెళ్లే రహదారి బురదమయమైంది. రోడ్లు అధ్వానంగా ఉండడంతో వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారులను బాగు చేయాలని కోరుతున్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- అతివేగమే కారణం





ప్రమాద ఘటన దృశ్యం (ఇన్‌సెట్‌లో) జగదీష్ (ఫైల్)

నరసన్నపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యవరం జంక్షన్ సమీపంలో సర్వీసు మార్గంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పోలాకి మండలం ఈదులవలస గ్రామానికి చెందిన మెండ జగదీష్ (19) సత్యవరం జంక్షన్ నుంచి గొట్టిపల్లి జంక్షన్ సర్వీసులో ద్విచక్రవాహనంపై స్నేహితుడు సాయిరాజ్‌తో కలిసి వెళుతుండగా అదే రోడ్డులో ఎదురుగా వస్తున్న పశుసంవర్ధకశాఖ సంచార వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో జగదీష్ అక్కడికక్కడే మృతి చెందగా వెనుక కూర్చున్న సాయిరాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద ఘటన విషయం తెలుసుకున్న ఎస్ఐ దుర్గాప్రసాద్ వెంటనే అక్కడికి చేరుకుని పరిశీలించారు. హెల్మెట్ ధరించకపోవడం, అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు పేర్కొంటున్నారు. పశు సంచార వాహనం కూడా ర్యాంగ్ రూట్‌లో రావడంతో ఈ కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి తండ్రి మెండ దాసు నాయుడు, తల్లి లక్ష్మి విశాఖపట్నంలో ఉంటున్నారు. జగదీష్ అమ్మమ్మ ఇంట్లో ఆదివారంపేటలో ఉంటున్నాడు. సాయిరాజ్ ముఖంపై బలమైన గాయాలుకాగా నరసన్నపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

సెల్ టవర్ నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ

టెక్కలి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పాతనౌపడా పంచాయతీ బంజీరుపేట సమీపంలోని ఓ ప్రైవేటు సెల్ టవర్ నుంచి గుర్తుతెలియని వ్యక్తి జారిపడి మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. సోమవారం స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా స్థలానికి సీఐ విజయ్‌కుమార్ చేరుకుని పరిశీలించారు. మృత దేహాన్ని టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే మృతుడి వివరాలు తెలియాల్సి ఉంది.

షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక దమ్మలవీధిలోని గోల్కొండ రేవు సమీపంలో ఉన్న సయ్యద్ జోషి ఇంట్లో కింద పోర్షన్‌లో పర్విదా బేగం ఆమె భర్త సుభాని నివసిస్తున్నారు. వీరు అరసవిల్లి గుడి దగ్గర ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తున్నారు. అయితే సోమవారం ఉదయం 11గంటల సమయంలో ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో ఉన్న వారంతా బయటకు వచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. స్థానికులు అగ్నిమాక అధికారులకు సమాచారం ఏడీఎఫ్‌వో వరప్రసాద్ తన బృందంతో అక్కడికి చేరుకుని మంటలు అదుపు చేసేందుకు యత్నించారు. ఇంట్లోకి వెళ్లే మార్గం చిన్నది కావడం అప్పటికే ఇంట్లో ఉన్న ప్లాస్టిక్ సామగ్రికి మంటలు అంటుకుని దట్టమైన పొగ అలముకున్నాయి. దీంతో మంటలు అదుపు చేసేందుకు కాసేపు ఇబ్బందిపడగా, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం ఉండొచ్చని అగ్నిమాపక అధికారులు అంచనా వేశారు.

పూరిల్లు దగ్ధం

రణస్థలం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నారువ గ్రామంలో ఎన్.నరసయ్యకి చెందిన పూరిల్లు సోమవారం అగ్నికి ఆహుతైంది. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో మంటలు చెలరేగాయి. సర్వం కాలిబుడిదయ్యాయని, కట్టుబట్టలతో మిగిలిపోయామని బాధితుడు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నాడు. ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే ఎన్ఈఆర్ అన్నారు.


బెల్టు దుకాణాలపై ఆకస్మిక దాడి

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ సీఐ ఆధ్వర్యంలో పెద్దపాడు పోలీసులు బెల్టు దుకాణాలపై సోమవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఎస్ఐ కె.రాము తన బృందంతో శిలగా శింగువలస గ్రామంలో తనిఖీలు నిర్వహించగా.. గ్రామంలో పాన్ షాపు నిర్వహిస్తున్న జామి సతీష్ కుమార్ తన దుకాణంలో మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నారు. ఈ దాడిలో ఏడు మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అలాగే చింతాడ గ్రామంలో మన్యం అక్కులు తన పాన్ షాపులో మద్యం విక్రయిస్తుండగా ఎస్ఐ రాము పట్టుకున్నారు. 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఇదిలా ఉండగా శిలగాం శింగువలస సమీపంలో ఎఫ్‌సీఐ గోడౌన్ సమీపంలో జామి ప్రసాదరావు ఇంట్లో మందుగుండు సామగ్రి నిల్వ ఉంచినట్టు వచ్చిన సమాచారం మేరకు తనిఖీ చేసి రూ.67,570 విలువ చేసే మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకుని.. నిందితుడిపై ఎస్ఐ రాము కేసు నమోదు చేశారు.

జూనియర్ కళాశాల సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు

జలుమూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాఠశాల ఆవరణలోకి చొరబడి పిల్లలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షురాలు కింజరాపు పద్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూనియర్ కళాశాలకు ఉన్నత పాఠశాల ఆవరణకు మధ్యలో గేటు ఉందని, ఆ గేటు తాళాలు పగులగొట్టి పాఠశాల ఆవరణలోని మొక్కలు నరికి దురుసుగా ప్రవర్తించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్యాప్తు చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కళాశాల సిబ్బంది పాఠశాల ఆవరణలో ప్రవేశించి ఇబ్బందులకు గురి చేయడం తగదని పాఠశాల హెచ్ఎం ఇప్పిలి వేణుగోపాలరావు ఆందోళన వ్యక్తంచేశారు. జిల్లా అధికారులు స్పందించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

గిరిజన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి



మన్యం జిల్లా జేసీ శోభికకు వినతి పత్రం అందజేస్తున్న జడ్పీటీసీ బుచ్చిబాబు

హిరమండలం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన గ్రామా ల్లో గత కొన్నేళ్లుగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు కోరారు. ఈ మేరకు సోమవారం సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన 'మీకోసం'లో పార్వతీపురం మన్యం జిల్లా జేసీ శోభికకు వినతి పత్రం అందజేశారు. మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు అందుబాటులో లేక పోవడంతో చిన్నారులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా గ్రామాల్లో మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రోడ్లు, కాలువలు, రక్షణ గోడల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు.

ఘనంగా అనఘాష్టమి పూజలు

నందిగాం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నందిగాం షిర్డీసాయి ధ్యానమందిరంలో అనఘాష్టమి పూజ లు సోమవారం ఘనంగా నిర్వహించారు. భక్తమండలి ఆధ్వర్యంలో గ్రామపురోహితులు ఎం.రమేష్‌శర్మ, సహాయకులు వంశీ పర్యవేక్షణలో పూజలు, హోమం చేపట్టారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

సైన్స్ ఎక్స్‌పోను విజయవంతం చేయండి

టెక్కలి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న యూరేకా సైన్స్ ఎక్స్‌పోను విజయవంతం చేయాలని జేవీవీ జిల్లా అధ్యక్షుడు కుప్పిలి కామేశ్వరరావు, కన్వీనర్ పాలవలస ధర్మారావు ఒక ప్రకటనలో కోరారు. జనవరి 26 వరకు విద్యార్థులు వ్యక్తిగతంగా గాని, ముగ్గురు సభ్యులతో కలిసి చేసిన ప్రయోగాలను వీడియో చేసి గూగుల్‌లో ఐదు నిమిషాల నిడివి మించకుండా అప్‌లోడ్ చేయాలన్నారు. విజేతలకు ఫిబ్రవరి 15న బహుమతులు అందజేస్తామన్నారు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

నరసన్నపేట/టెక్కలి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వస్తువులను కొనుగోలు చేసే సమయంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని టెక్కలి, నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు కె.లత, టి.గోవిందమ్మ అన్నారు. సోమవారం జాతీయ వినియోగదారులు దినోత్సవం సందర్భంగా కళాశాలల్లో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్, అర్థ, వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు పాల్గొన్నారు.

మండల డిజిటల్ అసిస్టెంట్ల నూతన కార్యవర్గం

నందిగాం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల గ్రామ సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్ల నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో టి.రాజారావు సమక్షంలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎ.సోమేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కె.వాసుదేవరావు, కార్యదర్శిగా కె.పుష్పలత, సాధారణ కార్యదర్శిగా ఎ.శివశంకర్, కోశాధికారిగా కె.షణ్ముఖరావు, సలహాదారులుగా పి.మల్లేశ్వరరావు, సీహెచ్ ఉదయ్‌కిరణ్‌లను ఎన్నుకున్నారు. వీరిని ఎంపీడీవో అభినందించారు.

బైక్ పంక్చర్ దుకాణానికి రూ.25,666 విద్యుత్ బిల్లు



టెక్కలి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పాత జాతీయరహదారి ఆదీ ఆంధ్రా వీధి జంక్షన్ సమీపంలో అంకులపిట్ట లింగరాజు అనే వ్యక్తి ఓ అద్దె దుకాణంలో బైక్ పంక్చర్లు వేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఆ దుకాణానికి ఇటీవల విద్యుత్‌శాఖ సిబ్బంది రూ. 25,666 బిల్లు ఇవ్వడంతో బాధి తుడు ఖంగు తిన్నాడు. తాను బైక్‌కు పంక్చర్లు వేస్తానని, తనకు ఇంత బిల్లు రావడం ఏమి టని ట్రాన్స్‌కో అధికారుల ముందు ఆవేదన వ్యక్తంచేశాడు. అయినా సమస్యకు పరిష్కారం లభించలేదని, సంబంధిత అధికారులు స్పం దించి న్యాయం చేయాలని కోరుతున్నాడు.

వేతనాలు ఇప్పించండి

పలాస, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ కిడ్నీ ఆసుపత్రిలో గత ఏడాది నుంచి అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పని చేస్తున్నామని, ఇప్పటి వరకు ఒక్క పైసా వేతనం అందలేదని, తగు చర్యలు తీసుకోవాలని వారు ఎమ్మెల్యే గౌతు శిరీషను కోరారు. ఈ మేరకు సోమవారం ఆమెను కలిసి తమ సమస్యలను వివరించారు. గత ఏడాది అక్టోబరు నుంచి 56 మంది విధుల్లో చేరామని, డిసెంబరులో కిడ్నీ ఆసుపత్రి ప్రారంభించారని, ఇప్పటి వరకు వేతనాలు ఇవ్వలేదన్నారు ఎమ్మెల్యే స్పందిస్తూ గత ప్రభుత్వంలో నియమాకాలు చేపట్టిందని, ఆప్కాసులో మీ పేర్లు నమోదు కాకపోవడంతో వేతనాలు మంజూరు కాలేదని, అసెంబ్లీలో ప్రస్తావించామన్నారు. త్వరలోనే బకాయిలు వస్తాయన్నారు.

పలాసలో హత్యా రాజకీయాలకు తెర తీస్తారా?

- మాజీమంత్రి అప్పలరాజును ప్రశ్నించిన ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పలాస ప్రాంతాన్ని ప్రశాంతంగా చూడాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఎటువంటి కక్షలు, వేధింపులకు పాల్పడడం లేదని, ప్రశాం తంగా ఉన్న పలాసలో మళ్లీ హత్య రాజకీయాలు చేస్తారా అని ఎమ్మెల్యే గౌతు శిరీష మాజీ మంత్రి అప్పలరాజును ప్రశ్నించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు హత్య కుట్రలో 17 మంది నిందితులు సీదిరి అప్పలరాజు, ఆయన భార్యతో తీసుకున్న ఫొటోలను ప్రదర్శించారు. ఇటీవల పోలీసు స్టేషన్ వద్ద బైఠాయించిన సమయంలో కూడా నీతో ఒక నిందితుడు ఉన్నారని, బీహార్ నుంచి ముఠాను తెప్పించి వైసీపీ నాయకులు హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ కేసు విచారణ కొనసాగుతుందని, ఇందులో మాజీ మంత్రి పాత్ర ఉందని తెలిస్తే తగు చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. మా కుటుంబ సభ్యులను విమర్శించే అర్హత నీకులేదన్నారు. సమావేశంలో ఏపీటీపీసీ ఛైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, చంద్రశేఖర్ త్యాడి, కుత్తుమ లక్ష్మణరావు, గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర గుప్తా, మల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌతు శిరీష

తప్పని పాట్లు

- ఇంకా ముంపులోనే పొలాలు
- ధాన్యం తడిచిపోయాయంటున్న రైతులు
- మళ్లీ మబ్బులతో ఆందోళన



నందిగాం: దేవళభద్రలోతడిచిపోయిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

నందిగాం/పలాసరూరల్/జలుమూరు/పోలాకి, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఇంకా నీటి ముంపులోనే పొలాలున్నాయి. ఆదివారం తెరిపి ఇవ్వడంతో ధాన్యం రక్షించుకునే పనిలో రైతులు నిమగ్నం కాగా సోమవారం మరలా వాతావరణంలో మార్పు వచ్చి మళ్లీ మబ్బులు వేయడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. నీటిలో మునిగిన చేల నుంచి నీటిని తొలగించడంతో పాటు ఆరబెట్టిన ధాన్యం తడిచిపోకుండా టార్పాలిన్లు కప్పారు. మళ్లీ వర్షాలు కురిస్తే పంటలపై ఆశ వదులుకోవాల్సిందేనని పలు గ్రామాల రైతులు అభిప్రాయ పడుతున్నారు. ఇదిలా ఉండగా జలుమూరు, పోలాకి వ్యవసాయాధికారులు కె.సురేష్, చిరంజీవి తదితరులు క్షేత్రస్థాయిలో పర్యటించి పాడైన పంటలను పరిశీలించి వాటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అపరాల పంటల రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.



పలాస రూరల్: అల్లుకోల వద్ద ఇంకా నీటిలోనే..



జలుమూరు: శ్రీముఖలింగం వద్ద వర్షపు నీటిలో ఉన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో సురేష్

మూడు రోజులుగా తాగునీరందడం లేదు

కోటబొమ్మాళి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళి పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన కాలనీకి మూడు రోజులుగా తాగునీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నామని జగనన్న కాలనీ వాసులు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో ఫణీంద్రకుమార్‌ను సర్పంచ్ కాళ్ల సంజీవరావుతో కలిసి వినతిపత్రం అందించారు. నీటి సరఫరా చేసే మోటార్ పాడవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని, ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలిపినా మాకు సంబంధం లేదని సమాధాన మిస్తున్నారని ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. తక్షణం తగు చర్యలు తీసు కోవాలని కోరారు. ఎంపీడీవోని కలిసిన వారిలో కాలనీ వాసులు ఎం. సుందరి, పి.సరస్వతి, యు.నమిత, కె.లలిత, ఎస్.శ్రీదేవి తదితరులున్నారు.

కాలువలు నిర్మించండి

ఎల్.ఎన్.పేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రోటరీనగర్ మొదటి వీధికి కాలువ సదుపాయం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు వి.పాండు రంగనాథరాజు తదితరులు సోమవారం ఎంపీడీవో పి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. రోటరీనగర్ నిర్మాణం జరిగి సుమారు నలభై ఏళ్లు గడిచినప్పటికీ ఇప్పటి వరకు కాలువల నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షపునీరు, వాడుకనీరు రోడ్లపై నిలిచిపోతోందని ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువను ఏర్పాటుచేయాలని కోరారు.

రైతులపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం

కాశీబుగ్గ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రైతు సంఘాల ఐక్య వేదిక నాయకులు అన్నారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సోమవారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. కేంద్రం తీసుకువచ్చిన నల్ల చట్టాల జీవో ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా రైతు, కార్మిక సంఘాల నాయకులు వేణుగోపాల్, గణపతి, రామారావు, బాలకృష్ణ, వినోద్, అజయ్, దుర్యోధన మాట్లాడుతూ.. పీఎం మోదీ ఇచ్చిన హామీ మేరకు రైతు పండించిన అన్ని పంట లకు మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలని, అందుకోసం స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతున్న రైతులపై నిర్బంధం ప్రయోగించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు బాలాజీరావు, అప్పయ్య, రవి, గోవింద్, జగన్, నాగేశ్వరరావు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



నల్ల చట్టాల జీవో ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

న్యూస్ బాక్స్

చివరి గింజ వరకు కొనుగోలు

హరిపురం, డిసెంబరు23 (ఆంధ్రజ్యోతి): చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని రైతులు అధైర్యపడ వద్దని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బిన్నల, బాలిగాం గ్రామాల్లో ముంపునకు గురైన వరి పంట పొలాలను సోమవారం పరిశీలిం చారు. మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో వరి రైతులు తీవ్ర నష్టాలకు గురయ్యారని.. ఈ పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి అన్ని రకాల రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం హరిపురంలో అగ్ని ప్రమాదానికి గురైన జీడిపరిశ్రమను పరిశీలించారు. ప్రమాద కారణాలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్తు ప్రమాదానికి గురైన యువకుడు సాయిని పరామర్శించారు. కార్యక్రమంలో టీడీ పీ నాయకులు బావన దుర్యోధన, దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, నవీన్, రట్టి లింగరాజు, పుల్లా వాసు, బైరిశెట్టి గున్నయ్య, అగ్గున్న జగన్నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ద్వారా సేవలందిస్తాం

పలాసరూరల్,డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): అగ్నికుల క్షత్రియ కులస్థులకు కార్పొరేషన్ ద్వారా సేవలం దించేందుకు కృషి చేస్తానని కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఇటీవల డైరెక్టర్‌గా నియమి తులైన ఆయనను బొడ్డపాడులో సోమవారం అగ్నికుల క్షత్రియులు సత్కరించారు. ఈ ప్రాంతాభివృద్ధికి తనవంతు కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సింహాద్రి, బొడ్డు దుష్యంత్, బుడత ధనరాజ్, గర్తం తులసీరావు, బొడ్డు మోహనరావు, గర్తం ఈశ్వరరావు, పోతనపల్లి చిరంజీవి పాల్గొన్నారు.

బిల్లుల భారాన్ని తగ్గించాలి

టెక్కలి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల భారాన్ని ప్రజలు మోయలేకున్నారని, తక్షణం విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం నాయకుడు సంబూరు షణ్ముఖరావు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, పంచాయతీ యంత్రాంగం పూడికలు తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. జగనన్న ఇళ్ల కాలనీపై విచారణ చేపట్టిన వివరాలను బయటపెట్టాలన్నారు. రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయా లని కోరారు. సమావేశంలో బగాది వాసుదేవరావు, ఈశ్వరరావు, లక్ష్మణరావు, సుబ్రహ్మణ్యం, పోలయ్య పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పూండి-గోవిందపురం హైస్కూల్ సోమవారం గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. గణిత టాలెంట్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించిన ఐదుగురు విద్యార్థు లకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డెరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, పాల్గొన్నారు. ● టెక్కలి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): చాకిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం శ్రీనివాస రామానుజన్ జయంతిని నిర్వహించారు. హెచ్ఎం ఎం.అనూ రాధ రామానుజన్ చిత్రపటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు.

● సంతబొమ్మాళి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గణితంపై మక్కువ పెంచుకోవాలని బోరుభద్ర జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం పి.రామకృష్ణ అన్నారు. పాఠశాలలో గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఆసుపత్రి జీపు మాయం దారుణం



కొత్తూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల కిందట కొత్తూరు పీహెచ్‌సీలో సేవలందించిన జీప్ చోరీకి గురికావడం దారుణమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి అన్నారు. కొద్ది రోజుల కిందట ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న జీపును దొంగిలించి అమ్మివేశారని, తీరా ఈ వ్యవ హారం బయటపడడంతో కొన్ని భాగాలను తిరిగి ఆసుపత్రి ఆవరణలో పడేశారన్నారు. సోమవారం సదరు భాగాలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ ఆస్తి పక్కదారి పట్టడం ఆసుపత్రి తీరుకు నిదర్శనమని, మూలకు చేరిన ప్రభుత్వ వాహనాన్ని చోరీకి పాల్పడ్డ విషయాన్ని డీఎంహెచ్‌వోకు ఫోన్‌లో వివరించారు. వాహనాన్ని చోరీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ముందస్తు క్రిస్మస్ సందడి

పాతపట్నం, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): క్షమాగుణం దేవుని సారూప్యతకు నిదర్శనమని పాస్టర్ జి.ప్రసాద్ అన్నారు. స్థానిక జేసీపీఎండ్‌ఈఎం చర్చి ఆధ్వర్యంలో సోమవారం ముందస్తు క్రిస్మస్ వేడు కలు నిర్వహించారు. యువతీయువకులు, విద్యార్థుల నృత్య ప్రదర్శనలు, గీతాలాపనలు ఆకట్టు కున్నాయి. స్థానిక డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ వి.అర్చన తదితరులు పాల్గొన్నారు.



పాతపట్నం: అంబేడ్కర్ గురుకులంలో నృత్యాభినయం చేస్తున్న చిన్నారులు



జలుమూరు: సంతలబైలిలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న పాస్టర్ రవిబాబు

కొత్తూరులో..

సంతబొమ్మాళి,డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వడ్డితాండ్ర పంచాయతీ కొత్తూరులో బిలీవర్స్ ఈస్టన్ చర్చి పాస్టర్ రమణ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండడమే ఏసుక్రీస్తు ఆశయమని ఆయన అన్నారు. పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.

సంతలబైలిలో..

జలుమూరు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తలతరియా పంచాయతీ సంతలబైలి గ్రామంలో పాస్టరు తమ్మినేని రవిబాబు ఆధ్వర్యంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. పలు నృత్య ప్రదర్శనలు చేపట్టారు. మాజీ సర్పంచ్ చల్ల విజయలక్ష్మి, వాన సిమ్మయ్య, చల్ల జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరులో ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు